క్లుప్తంగా

చెక్‌పోస్టులను పరిశీలించిన తుమకూరు జిల్లా కలెక్టర్



చెక్‌పోస్ట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శుభ కళ్యాణ్

పావగడ: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆంధ్ర సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌లను తుమకూరు జిల్లా కలెక్టర్ శుభ కళ్యాణ్ బుధవారం పరిశీలించారు. వెంకటమ్మనహళ్లి (ఎగువ పల్లి), నాగలాపురం చెక్‌పోస్టులను పరిశీలించి ఎస్పీ అశోక్‌కుమార్‌కు పలు సూచనలు చేశారు.

క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

హిందూపురం అర్బన్: మండల పరిధిలోని ముద్దిరెడ్డిపల్లిలో ఆన్‌లైన్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న సురేష్, చంద్రా, నాగన్నలను బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.14,000 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

మడకశిర బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గోవిందరాజులు



గోవిందరాజులు, త్రిలోక్‌నాథ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మడకశిర: మడకశిర బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శిగా యువ న్యాయవాది త్రిలోక్‌నాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా నాగేంద్ర, ఉప కార్యదర్శిగా జయరామ్, కోశాధికారిగా హనుమంతరాయుడు, లైబ్రేరియన్‌గా నాగరాజును ఎంపిక చేశారు. బుధవారం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులు సమావేశమై కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

తెగిపడిన విద్యుత్ తీగలు

అమరాపురం: మండలంలోని వలస గ్రామంలోని వ్యవసాయ తోటలో ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ తెగిపడటంతో బుధవారం అగ్ని ప్రమాదం జరిగింది. లైన్‌మాన్‌కు విద్యుత్ సరఫరా ఆపేయడంతో ప్రమాదం తప్పింది. హితేంద్రకు చెందిన కొబ్బరి, వక్క చెట్లు, బాబన్నకు చెందిన కొబ్బరి వక్క చెట్లు పాక్షికంగా కాలిపోయినట్లు బాధితులు తెలిపారు.

నేడు ఉషశ్రీచరణ్ ఎన్నికల ప్రచారం


పరిగి: మండలంలోని పీ నరసాపురం, శిరేకోళం, హొన్నంపల్లి పంచాయతీలో గురువారం సాయంత్రం 5.30 గంటలకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని ఆ పార్టీ మండల కన్వీనర్ నరసింహమూర్తి తెలిపారు.

సోమందేపల్లి: మండలంలోని నాగినాయని చెరువు, గుడిపల్లి, తుంగోడు, వెలిదడకల, చాలకూరు గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ బూత్ కమిటీలు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశమవుతారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి తెలిపారు.

ఆటోకు నిప్పు

హిందూపురం అర్బన్: పట్టణంలోని ఆటోనగర్‌కు చెందిన కార్తీక్ అనే వ్యక్తికి చెందిన ఆటో మంగళవారం రాత్రి ఇంటి వద్ద ఆపి ఉంచాడు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు ఆటోకు నిప్పుపెట్టినట్లు కార్తీక్ తెలిపారు. అయితే ఆటో పాక్షికంగా దెబ్బతిందని, ఎవరైనా ఆటోకు నిప్పు పెట్టారా? లేక ప్రమాదవశాత్తూ జరిగిందా అనేదానిపై విచారణ చేపట్టినట్లు పట్టణ సీఐ వి.శ్రీనివాసులు తెలిపారు.

పోలీసుల తనిఖీలు



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

పెనుకొండ: పట్టణంలోని దర్గా సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కార్లు, బైక్‌లు, తదితర వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

యాదవుల ఆత్మీయ సమావేశం

హిందూపురం: పట్టణంలోని డీఆర్ కాలనీలో బుధవారం ఉమ్మడి అనంతపురం జిల్లా యాదవ సంఘం యువజన విభాగ అధ్యక్షుడు యుగంధర్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. యుగంధర్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో బీసీల అభ్యున్నతికి కృషిచేశారని, రానున్న రోజుల్లో యాదవుల అభ్యున్నతికి ప్రభుత్వం మరింత కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో యాదవులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేడు విగ్రహ పునఃప్రతిష్ట

లేపాక్షి: మండలంలోని చోళసముద్రంలో వెలసిన చౌడేశ్వరిదేవి దేవాలయంలో గురువారం ఉదయం అమ్మవారి స్థిరమూర్తి పునఃప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అర్చకులకు అండ



ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఆంజనేయస్వామి మూల విరాట్ విగ్రహం రొళ్ల మండలం ఆవిన కుంటలో ఉంది. గతంలో ఈ ఆలయంలో నిత్య పూజలు జరిగేవి కావు. ఈ ఆలయానికి ఎలాంటి ఆదాయం లేకపోవడంతో నిత్య పూజలు నిర్వహించే వారు కాదు. అయితే ఈ ఆలయ అర్చకుడు వెంకటేశ్‌కు ప్రభుత్వం ధూపదీప నైవేద్య పథకాన్ని వర్తింపజేసింది. దీంతో ప్రతి నెలా రూ.5 వేల చొప్పున ఖాతాలో జమ చేస్తోంది. ఇందులో ప్రతి నెలా రూ.2 వేల ఖర్చు పెట్టి నిత్య పూజలు చేస్తున్నారు.

- ధూపదీప నైవేద్యం పథకం ద్వారా ప్రతినెలా రూ.5 వేల ఆర్థిక సాయం
- ఇందులో రూ.2 వేలు నిత్య పూజలకు వ్యయం
- మరో రూ.3 వేలు అర్చకులకు సాయం
- నిత్య పూజలకు నోచుకుంటున్న ఆలయాలు

మడకశిర: నియోజకవర్గంలోని అర్చకులకు జగనన్న ప్రభుత్వం అండగా నిలిచింది. ధూపదీపనైవేద్యం పథకం (డీడీఎన్) ద్వారా ఆర్థికసాయం అందిస్తోంది. ఈ పథకం అమలుతో దేవాలయాల్లో నిత్య పూజలు నిర్వహించడానికి కూడా అవకాశం ఏర్పడింది. మహానేత వైఎస్సార్ ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఈ పథకాన్ని కొనసాగిస్తోంది. ఎంతో మంది అర్చకులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. అర్హత కలిగిన అర్చకులకు ఈ పథకం ద్వారా ప్రతి నెలా రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది.

తక్కువ ఆదాయం వచ్చే ఆలయాల అర్చకులకు..

నియోజకవర్గంలో తక్కువ ఆదాయం వచ్చే దేవాలయాలకు ప్రభుత్వం ఈ పథకాన్ని వర్తింపజేసింది. ముఖ్యంగా ప్రతి ఏడాది రూ.50 వేల వరకు ఆదాయం వచ్చే దేవాలయాల్లో పని చేసి అర్చకులు ఈపథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. ప్రతి నెలా వచ్చే రూ.5 వేలలో అర్చకులు వారి సొంత అవసరాలకు రూ.3 వేలు ఉపయోగించుకోవడానికి అవకాశం ఉంది. మిగిలిన రూ.2 వేలను ఆయా ఆలయాల్లో నిత్య పూజలకు ఖర్చు పెడుతున్నారు.



రొళ్ల మండలం ఆవినకుంటలోని ఆంజనేయస్వామి దేవాలయం

దేవాలయాల్లో నిత్య పూజలు

ధూపదీప నైవేద్యం పథకం అమలు ద్వారా ఎన్నో దేవాలయాలు నిత్య పూజలకు నోచుకుంటున్నాయి. చాలా ఆలయాల్లో ఆర్థిక ఇబ్బందుల కారణంగా నిత్య పూజలు జరిపే వారు కారు. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం ధూపదీప నైవేద్యం పథకాన్ని పక్కాగా అమలు చేస్తోంది. నిత్య పూజలు జరపడానికి రూ.2 వేలు కేటాయించింది.

ప్రస్తుతం అర్చకులు ప్రభుత్వం అందిస్తున్న సాయంతో దేవాలయాల్లో నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. ఈ పథకం ద్వారా అర్చకుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడడమే కాకుండా దేవాలయాల్లో నిత్య పూజలు నిర్వహిస్తున్నారు.

మడకశిర నియోజకవర్గంలో లబ్ధి పొందిన అర్చకుల వివరాలు ఇలా.....

సంవత్సరం	లబ్ధి పొందిన అర్చకులు
2021-22	39
2022-23	13
2023-24	48

ఇబ్బంది లేకుండా నిత్య పూజలు



ధూపదీప నైవేద్యం పథకం ద్వారా ఆలయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా నిత్య పూజలు చేయడానికి అవకాశం ఏర్పడింది. ప్రతి నెలా ఈ పథకం ద్వారా నాకు రూ.5 వేలు వస్తోంది. ఇందులో రూ.2 వేలు నిత్య పూజలకు ఖర్చు పెడుతున్నాను.

- దేవరాజప్ప, అర్చకుడు, వీరభద్రస్వామి ఆలయం, మధూడి

జగన్‌కు రుణపడి ఉంటా



గంగులవాయిపాళ్యం ఆంజనేయ స్వామి ఆలయంలో అర్చకుడిగా పని చేస్తున్నా. ప్రస్తుతం తనకు ప్రభుత్వం డీడీఎన్ పథకం ద్వారా రూ.5 వేలు ఇస్తోంది. గతంలో ఏ ప్రభుత్వం అర్చకుల సంక్షేమాన్ని పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణ పడి ఉంటా.

- త్యాగరాజు, అర్చకుడు, జీవీపాళ్యం

ఆర్థికంగా ఊరట



ఫళారంలోని ఈశ్వర ఆలయంలో అర్చకుడిగా పని చేస్తున్నా. అర్చకత్వం ద్వారా ఆదాయం అంతంత మాత్రమే. కుటుంబాన్ని పోషించుకోవడం కష్టంగా మారింది. ఇలాంటి పరిస్థితిలో ప్రభుత్వం డీడీఎన్ పథకాన్ని వర్తింప జేయడంతో ఆర్థికంగా ఊరట లభించింది.

-సిద్ధరామప్ప, అర్చకుడు, ఫళారం

ఆంజనేయా పాహి.. పాహి..



దండురోడ్డు ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పూజలు నిర్వహించిన దృశ్యం

హిందూపురం: ఆంజనేయస్వామి మండల పూజ మహోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హిందూపురంలోని దండురోడ్డులో నూతనంగా ప్రతిష్ఠించిన 27అడుగుల భారీ ఆంజనేయస్వామి రాతి విగ్రహం వద్ద హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుదీర్చి మేళతాళాలతో ప్రాకారోత్సవం నిర్వహించారు.

సరిహద్దుపై ప్రత్యేక నిఘా

- పెనుకొండ డీఎస్పీ బాజిజాన్ సైదా



అగళి మండల పరిధిలోని ఆలూడి చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేస్తున్న డీఎస్పీ బాజిజాన్ సైదా

అమరాపురం/రొళ్ల/అగళి: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా సరిహద్దు చెక్‌పోస్టుల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని పెనుకొండ డీఎస్పీ బాబిజాన్ సైదా తెలిపారు. బుధవారం ఆయన అమరాపురం, రొళ్ల, అగళి మండలాల్లో ఏర్పాటు చేసిన వివిధ చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో కర్ణాటక ప్రాంతాల నుంచి నిషేధిత వస్తువులు, నగదు అక్రమ రవాణా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రచారానికి అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అపూర్వభరత్

పెనుకొండ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు 48 గంటలకు ముందే ప్రచారానికి దరఖాస్తు చేసుకోవాలని సబ్‌కలెక్టర్ అపూర్వభరత్ పేర్కొన్నారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో బుధవారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నిబంధనల మేరకు నడుచుకోవాలన్నారు.

మేలు మరచిపోవద్దు



నారనాగేపల్లిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి ఉషశ్రీచరణ్

- ఎన్నికల ప్రచారంలో ఉషశ్రీచరణ్

రొద్దం: అమ్మా బాగున్నారా.. జగనన్న ప్రభుత్వ పాలన ఎలా ఉంది అంటూ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ ఓటర్లను ఆప్యాయంగా పలకరిస్తూ రొద్దం మండలం నారనాగేపల్లిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కుశల ప్రశ్నలు వేస్తూ ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ప్రతి ఇంటికీ ఏదో ఒక పథకం అందుతోందని ప్రజలు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ప్రభుత్వ పాలనపై సానుకూలంగా స్పందించారు. మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రజల చెంతకు ప్రభుత్వ పాలన అందిస్తున్నారన్నారు. పేదలకు అభ్యున్నతికి అన్ని విధాలా కష్టపడుతున్న జగనన్న ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీల నాయకులు, ఎల్లో మీడియా లేనిపోని అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు మేలు చేసే వ్యక్తులను ఎప్పటికీ మరవకూడదన్నారు. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలుపించాలని కోరారు. సర్పంచ్ నాగార్జున, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసులు, జేసీఎస్ కన్వీనర్ చిలకల రవి, న్యాయవాది అశ్వర్థనారాయణ, నాయకులు బి.నారాయణరెడ్డి, అక్కులప్ప, ఎస్ నారాయణరెడ్డి, సి.నారాయణరెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, మారుతీరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, రాజారెడ్డి, కేపీ శ్రీనివాసులు, వినాయ్‌రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

జగన్‌ను మరోసారి ఆశీర్వదించండి



వలస గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న ఈరలక్కప్ప

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

అమరాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వీ.అగ్రహారం, వలస, నడలూడం, విరుపసముద్రం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలను అందించిన వైఎస్ జగన్‌ను మరోసారి సీఎంను చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశంలోనే ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా పేదలు, మహిళలు, అన్ని వర్గాల ప్రజలకు మంచి చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగనేనని కొనియాడారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థి అయిన బోయ శాంతమ్మలను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ మంత్రి హెచ్‌బీ.నర్సేగౌడ్, రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ నళిని, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు రవిశేఖర్‌రెడ్డి, వాగేష్, రాష్ట్ర బీసీ.విభాగం ఉపాధ్యక్షుడు కాంతరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, సర్పంచ్ నాగవేణి, ఎంపీటీసీ లక్ష్మీదేవి, స్థానిక నాయకులు, రాజప్ప, బీరలింగప్ప, మోహన్, సిద్దేశ్వర, హితేంద్రప్ప, నాగేంద్రప్ప, నాగరాజు, నరసింహమూర్తి, రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్లు వీరక్యాతరాయప్ప, గగన, ఎంపీపీ ఈరన్న, వైస్.ఎంపీపీ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు



పరీక్షలు ముగియడంతో హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు

హిందూపురం టౌన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి. పట్టణ, మండల వ్యాప్తంగా 15 సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. చివరి రోజుకు సోషల్ పరీక్షకు 3,217 మంది విద్యార్థులకుగాను 3,063 మంది హాజరు కాగా 154 మంది గైర్హాజరయ్యారు.

చిలమత్తూరు: మండలంలోని ఎస్ఎస్‌వైవీఎన్ ప్రైవేటు పాఠశాలలో బుధవారం సోషల్ పరీక్షకు 491 మంది హాజరుకావాల్సి ఉండగా 480 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఈశ్వర్ ప్రసాద్ తెలిపారు.

పరిగి: మండలంలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన సోషల్ పరీక్షకు 743 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా... 715 మంది మాత్రమే పరీక్ష రాశారని ఎంఈఓ-2 శేషాచలం తెలిపారు. 28 మంది గైర్హాజరైనట్లు చెప్పారు.

గోరంట్ల: పదో తరగతి పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన సోషల్ పరీక్షకు 1,118 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 1073 మంది హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి గోపాల్ తెలిపారు. 45 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

గుడిబండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్, కరికెర కేజీబీవీలో బుధవారం నిర్వహించిన సోషల్ పరీక్షకు 613 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ రఘు, గిరిజమ్మ తెలిపారు. పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

వైభవంగా బ్రహ్మ రథోత్సవం



భక్తుల మధ్య సాగుతున్న బ్రహ్మ రథోత్సవం

పావగడ: తాలూకాలోని వదనకల్లులో వెలసిన తిప్పేరుద్రస్వామి బ్రహ్మ రథోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని బ్రహ్మ రథంపై కొలువుదీర్చి పూజల అనంతరం రథోత్సవం నిర్వహించారు. గ్రామ పంచాయతీ సభ్యులు తిప్పేరుద్రస్వామికి కేజీ వెండి కిరీటాన్ని బహూకరించారు.

మంత్రిపై బురదజల్లడం సరికాదు

పెనుకొండ: మండల పరిధిలోని ఎర్రమంచి వ్యవసాయ పొలంలో తమకు న్యాయబద్ధంగా రావాల్సిన భూమి కోసం జేసీబీలతో చదును చేయిస్తుంటే ఆ వ్యవహారాన్ని మంత్రి ఉషశ్రీచరణ్‌కు అంటగట్టడం హేయమని పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని కొండాపురంకు చెందిన జొన్నల బాబన్న వారసులు వెంకటరామిరెడ్డి, అంజనరెడ్డి, రవీంద్రారెడ్డి తెలిపారు. 90 ఏళ్ల క్రితం జొన్నల బాబన్న వారసులు, నగర పంచాయతీ పరిధిలోని వెంకటరెడ్డిపల్లికి చెందిన బూరెడ్డిపల్లి నరసప్ప చెరి ఒక్కో భాగం 31.40 ఎకరాల చొప్పున 62.80 ఎకరాల భూమిని కొనుగోలు చేశారన్నారు. ఇందులో 31.40 ఎకరాల భూమిని జొన్నల బాబన్న వారసులకు అందకుండా వెంకటరెడ్డిపల్లికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ దత్తారెడ్డి ప్రయత్నిస్తున్నాడని చెప్పారు. తమ హక్కు పత్రాలను చూసిన అధికారులు, న్యాయస్థానం కూడా భూమిలోకి వెళ్లవచ్చని చెప్పారన్నారు. అయితే దత్తారెడ్డి మాత్రం తమ భూమిని చదువును చేయిస్తుంటే ఏం చేయాలో తెలీక మంత్రి ఉషశ్రీచరణ్ అండతో చెట్లు తొలగిస్తున్నారని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఉషశ్రీచరణ్ ఇక్కడకు వచ్చి కేవలం మూడు నెలలైందని తాము ఆమెను కలసిన సందర్భం కూడా లేదన్నారు.

భూయజమానికి భారీగా జరిమానా

లేపాక్షి: లేపాక్షిలోని పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న 8 చింతచెట్లను అనుమతి లేకుండా కొట్టేయించిన భూయజమాని శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి రూ. 1.42 లక్షల జరిమానా విధించినట్లు పెనుకొండ అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ అక్బరుద్దీన్ తెలిపారు. అనుమతుల్లేకుండా ఎవరు చెట్లను నరికినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

అమరాపురం: మండల పరిధిలోని గ్రామాల్లో ఎక్కడా తాగునీటికి ఇబ్బంది లేకుండా సచివాలయం కార్యదర్శులు శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ మునిస్వామి, తహసీల్దార్ వెంకటసుబ్బయ్య సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని వీఆర్వోలు, సచివాలయం కార్యదర్శులతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మండలంలో ఎక్కడైనా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాలంటే ముందుగానే రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతి తీసుకోవాలన్నారు.

టెర్రరిస్టులు కాదు.. ప్రజా సేవకులు

మడకశిర: జనసేన, టీడీపీ నాయకులు వలంటీర్లపై తప్పుడు విమర్శలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వైఎస్ రవిశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో హితవు పలికారు. వలంటీర్లు టెర్రరిస్టులు కాదని, ప్రజా సేవకులని తెలిపారు. వలంటీర్లపై టీడీపీ నాయకుడు బొజ్జల సుధీర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. వెంటనే వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి పక్షాలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు వైఎస్ జగన్‌కు మరోసారి పట్టంకట్టడం ఖాయమన్నారు.

మహిళలకు క్విజ్ పోటీలు

పెనుకొండ: పట్టణంలోని ఆర్యవైశ్య మహిళలకు వాసవీ మాతకు సంబంధించి బుధవారం క్విజ్ పోటీలను నిర్వహించారు. పట్టణంలోని ఆర్యవైశ్య కన్వెన్షన్ హాల్లో జరిగిన పోటీల్లో గెలుపొందిన పలువురికి ఆర్యవైశ్య కమిటీ పెద్దలు బహుమతులు ప్రదానం చేశారు.